## క్లుప్తంగా

### బొంతువారిపేటలో వైద్య శిబిరం

**అంబాజీపేట:** స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బొంతువారిపేటలో బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సీహెచ్‌ఓ బి.అప్పారావు మాట్లాడుతూ ప్రజలు కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. అనంతరం పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. వైద్య సిబ్బంది జె.ప్రసాద్ పాల్గొన్నారు.

**నేడు తొండవరంలో..**

**అంబాజీపేట:** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వైద్యారోగ్య శాఖ సౌజన్యంతో శుక్రవారం తొండవరం పంచాయతీ కార్యాలయం వద్ద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ అధ్యక్షుడు వి.నరేష్ తెలిపారు. ఇక్కడ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ, అనంతరం వాకలగరువులో మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకూ శిబిరం ఉంటుందన్నారు.

### కాలువలో పూడిక తొలగింపు

**అంబాజీపేట:** పుల్లేటికుర్రు శివారు కొల్లిపారిపేట వద్ద మురుగు కాలువలో పూడిక, చెత్తా చెదారాన్ని శ్రీవ్యాఘ్రేశ్వర ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం తొలగించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ వి.సరోవర్ అనుమతితో మాజీ ఎంపీపీ దాసరి వీరవెంకట సత్యనారాయణ సహకారంతో మురుగు కాలువను శుభ్రం చేశామని సంఘ నాయకులు తెలిపారు. అలాగే కాలువపై శిథిలమైన వంతెనను తొలగించారు. సంఘ అధ్యక్షుడు కొప్పిశెట్టి ఆనంద వెంకట ప్రసాద్, ఉపాధ్యక్షుడు అయ్యగారి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి అడబాల రాజమోహన్, కొల్లి వెంకట్రావు పాల్గొన్నారు.

### పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

**అంబాజీపేట:** పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సర్పంచ్ వాసంశెట్టి రేవతి అన్నారు. వక్కలంకలో పంచాయతీ కార్మికులు గురువారం ప్రత్యేక పారిశుధ్య పనులను చేపట్టారు. అలాగే గంగలకుర్రులో సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈఓపీఆర్డీ బి.మమత, కార్యదర్శి సత్యవేణిల పర్యవేక్షణలో పనులు చేశారు. అనంతరం బ్లీచింగ్ చల్లించారు.

**మామిడికుదురు:** వరద ప్రభావిత గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా బి.దొడ్డవరంలో పారిశుధ్య పనులు నిర్వహించారు. ఇందిరమ్మ కాలనీ, వీరభద్రస్వామి ఆలయం, చింతపల్లివారి గ్రూపు ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించారు. సర్పంచ్ చెల్లుబోయిన రామశివసుబ్రహ్మణ్యం, కార్యదర్శి పట్టిలింగం పర్యవేక్షించారు.

### స్టూడెంట్ కిట్ల పంపిణీ



విద్యార్థినికి స్టూడెంట్ కిట్ అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

**అయినవిల్లి:** ముక్తేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన స్టూడెంట్ కిట్లను జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పంపిణీ చేశారు. గురువారం ఆయన ఆ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఉన్నత భావాలు అలవర్చుకోవాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, సిరిపల్లి సర్పంచ్ కుడుపూడి శాంతావతి, ఎంపీటీసీ సభ్యుడు యడ్ల కిరణ్, వైఎస్సార్ సీపీ నాయకుడు రావూరి వెంకటరామారావు పాల్గొన్నారు.

**ఆలమూరు:** పినపళ్ల, పెదపళ్ల, చింతలూరు, చొప్పెల్ల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను ప్రజాప్రతినిధులు, అధికారులు పంపిణీ చేశారు. సర్పంచులు సంగిత సుభాష్, మార్గని కరుణ, యేడిద సత్యశ్రీ, దంగేటి చంద్రకళ, ఎంఈఓలు పి.సాలెంరాజు, ఎస్వీ సుబ్బరాజు పాల్గొన్నారు.

### దేశభక్తిని పెంపొందించాలి


**అంబాజీపేట:** జాతీయ సమైక్యత, సమగ్రతను పెంపొందించే కార్యక్రమాలతో విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించాలని ఎంఈఓ–2 మోకా ప్రకాష్ అన్నారు. పుల్లేటికుర్రు శివారు వ్యాఘ్రేశ్వరం ప్రాథమిక పాఠశాల వద్ద శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రతిబింబించే కార్యక్రమాలను హెచ్ఎం కేకే దుర్గ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వల్లివేటి రామకృష్ణమూర్తి సమకూర్చిన సుమారు రూ.25 వేల విలువైన నాలుగు కుర్చీలు, టీవీ, సీలింగ్ ఫ్యాన్, మట్టి పలకలు, బలపాలు, వేమన శతక పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్‌పర్సన్ వీర లక్ష్మీదుర్గ, సీఆర్పీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### వక్కలంకలో నీటి పరీక్షలు

**అంబాజీపేట:** ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో నీటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ వాసంశెట్టి రేవతి అన్నారు. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా సెంట్రల్ టీమ్ పర్యవేక్షణలో గురువారం వక్కలంకలో నీటి పరీక్షలు చేశారు. గ్రామంలో తాగునీటి ట్యాంకు, కుళాయిలను పరిశీలించారు. అనంతరం ఇళ్లలో వాడుతున్న నీటి పరీక్షలు చేశారు.

### శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

**పి.గన్నవరం:** శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు అన్నారు. గురువారం పి.గన్నవరం పోలీస్ స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. తొలుత ఎస్పీ కృష్ణారావుకు ఎస్సై బి.శివకృష్ణ పూల మొక్క అందించి స్వాగతం పలికారు. సీఐ ప్రశాంతకుమార్ పాల్గొన్నారు.



జొన్నాడలో రెండు వంతెనల మధ్య గోదారమ్మ



టేకిశెట్టిపాలెంలో వరద పరిస్థితిని పరిశీలిస్తున్న జేసీ నిశాంతి



పి.గన్నవరం కొత్త అక్విడెక్ట్ వద్ద వరద నీటి ఉధృతి



అప్పనరామునిలంక నుంచి సఖినేటిపల్లి కాజ్ వే వైపు వెళ్లే రహదారిపై వరద నీరు

# కన్నీటి కష్టాలు

- లంక గ్రామాల్లో 'జల'జీవనం
- కాజ్‌వేలపై ఇంకా వరద
- రాకపోకలకు ఇబ్బందులు

**మామిడికుదురు/ అయినవిల్లి/ అంబాజీపేట/ సఖినేటిపల్లి/ ఆలమూరు:** వరద వీడలేదు.. లంక గ్రామాల్లో కష్టాలు తీరలేదు.. చుట్టూ నీరు పోలేదు.. రోడ్లపై రాకపోకలు సాగలేదు.. గోదావరి వరద పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాలను అతలాకుతలం చేస్తోంది. మామిడికుదురు మండలం అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం గ్రామాలు ఇంకా కుదటపడడం లేదు. పాశర్లపూడి కరకట్ట దిగువన ఉన్న అప్పనపల్లి కాజ్‌వేపై ఆరు అడుగుల మేర నీరు ప్రవహిస్తోంది. ఈ మార్గాన్ని పూర్తిగా మూసివేశారు. మామిడికుదురు శివారు కొర్లగుంట ఏటిగట్టు దిగువన ఉచ్చులవారిపేట రోడ్డుపై వరదనీటి ప్రవాహం సాగుతోంది. రెండడుగుల మేర నీరు నిలిచిపోయింది. ఈ నీటిలోంచే స్థానికులు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి దర్శనాలను గురువారం రెండో రోజు కూడా నిలిపివేశారు. గోదావరి పరివాహక గ్రామాల్లో సాగు చేసిన అరటి, బీర, బెండ, మునగ తదితర కూరగాయల తోటలను వరద ముంచెత్తడంతో తాము తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెదపట్నం మధ్యలంక పూర్తిగా వరద నీటిలో ఉంది. పాశర్లపూడి, పాశర్లపూడిలంక మత్స్యకార ప్రాంతాల్లోనూ అదే పరిస్థితి. ముంపు నీటిలోనే గంగపుత్రులు బిక్కుబిక్కు మంటూ కాలం గడుపుతున్నారు. భద్రాచలంలో తగ్గుముఖం పట్టిన గోదావరి వరద మళ్లీ పెరుగుతుందన్న సమాచారం ఆయా ప్రాంతాల బాధితులను ఆందోళనకు గురి చేస్తోంది. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు వ్యాధులు ప్రబలకుండా లూటుకుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి స్పందన ఆధ్వర్యంలో పాశర్లపూడిలంక కరకట్టపై ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

- గోదావరి వరద పరిస్థితిని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి సమీక్షించారు. అప్పనపల్లి కాజ్‌వేను ఆమె పరిశీలించారు. అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల్లో వరద బాధితుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. భద్రాచలం వద్ద గోదావరి వరద మళ్లీ పెరుగుతుందని అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆర్డీఓ కేశవ్ వర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ ఎం.మేరికమ్మ, నగరం ఎస్సై పి.సురేష్ పాల్గొన్నారు.

**తాగునీరు అందక..**

అయినవిల్లి మండలం అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం, పొట్టిలంక, కొండుకుదురులంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో ఇళ్ల వద్దకు వరద చేరింది. లంక వాసులు నానా ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు అందని పరిస్థితి నెలకొంది. అధికారులు తాగునీటి ప్యాకెట్లు అందించినా నిల్వ వాసన వస్తుందని ప్రజలు అంటున్నారు. ముక్తేశ్వరం– అయినవిల్లిలంక ఎదురుబిడెం కాజ్‌వేపై పడవలపై నిత్యావసరాల కోసం రాకపోకలు జరుపుతున్నారు.

**ఒరిగిన విద్యుత్ స్తంభాలు**

అంబాజీపేట మండలం మాచవరం పంచాయతీ పరిధి స్త్రీల ఆసుపత్రి సమీపంలో కౌశిక గట్టు వర్షపు నీటికి, వరదలకు పూర్తిగా నానిపోయింది. దీంతో మూడు విద్యుత్ స్తంభాలు నీటిలోకి ఒరిగిపోయాయి. అలాగే తొండవరం, వాకలగరువు, చిరతపూడి, గంగలకుర్రు అగ్రహారం, మొసలపల్లి, పుల్లేటికుర్రు, కె.పెదపూడి గ్రామాల్లో పది విద్యుత్ స్తంభాలు వర్షాలకు నేలకొరిగాయి. విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ కె.మోహన్ ఆధ్వర్యంలో సిబ్బంది విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

**కొనసాగుతున్న ఉధృతి**

సఖినేటిపల్లి మండలంలోని పలు ప్రాంతాల్లో వరద నీరు ఇంకా వీడలేదు. సఖినేటిపల్లి లంక పరిధి రేవు వద్ద, సఖినేటిపల్లి లాకుపేటలో వరద నీరు ప్రవహిస్తోంది. లాకుపేటలోని ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి. ఏటిగట్టుకు దిగువన టేకిశెట్టిపాలెంలో అగ్నికుల క్షత్రియ కాలనీ జలదిగ్బంధంలోనే ఉంది. అప్పనరామునిలంకలో వరద ఉధృతి కొనసాగుతోంది. డాక్టర్ అంబేడ్కర్ సెంటర్ నుంచి టేకిశెట్టిపాలెం వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా నీటితో నిండింది. ఇక్కడ కొత్తగా నిర్మించిన కాజ్ వే జలదిగ్బంధంలో చిక్కుకుంది. వీటితో పాటు అంబేడ్కర్ సెంటర్ నుంచి సఖినేటిపల్లి వైపున కాజ్ వే మీదుగా ఉన్న మార్గంలో నీరు చేరింది. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శిరీష పర్యవేక్షణలో ముంపు గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. టేకిశెట్టిపాలెం ఏటిగట్టు దిగువన వరద ఉధృతిని జేసీ నిశాంతి పరిశీలించారు. మండలంలోని పలు ప్రాంతాల్లో మండల ప్రత్యేకాధికారి సిద్ధార్థ వర్మతో పాటు జేసీ పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో బాధిత కుటుంబాలకు అందుతున్న సేవలపై జేసీకి ప్రత్యేకాధికారి వివరించారు. ఏపీఓ నాగప్రసాద్, కార్యదర్శి ఎ.గంగరాజు మాట్లాడుతూ బాధితులకు వాటర్ టిన్‌లను పడవల ద్వారా అందిస్తున్నామన్నారు. ఆర్డీవో కేశవ వర్ధన్ రెడ్డి, తహసీల్దార్ సీహెచ్ పెద్దిరాజు, ఎంపీడీఓ పీవీ సత్యనారాయణ, డీటీ సీహెచ్ భాస్కర్ పాల్గొన్నారు.

- ఆలమూరు మండలం మడికి, మూలస్థాన అగ్రహారం, జొన్నాడ, చొప్పెల్ల గ్రామాల్లోని లంక భూముల్లోకి పాక్షికంగా వరద నీరు వచ్చి చేరింది. రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసు శాఖ వరద తీవ్రతపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపడుతూ ఏటిగట్టు వెంబడి పహరా కాస్తున్నారు. ఈ నెల 27 నుంచి బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణ శాఖ హెచ్చరికలతో లంక గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు.

**మళ్లీ ఆందోళన..**

**పి.గన్నవరం:** వశిష్ట, వైనతేయ నదీపాయల్లో వరద ఉధృతి కాస్త తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాంతాల్లో మళ్లీ వరద పెరుగుతుండటంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నదీపాయలో తాత్కాలిక రహదారి కొట్టుకుపోవడంతో ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, బూరుగులంక, అరిగెలవారిలంక గ్రామాల ప్రజలు ఇంజన్ బోట్లపై ప్రయాణిస్తున్నారు. కె.ఏనుగుపల్లి రహదారిపై వరదనీరు చేరడంతో ప్రజలు కాలినడకన రాకపోకలు సాగిస్తున్నారు. మానేపల్లి శివాయలంకకు వెళ్లే రహదారిపై నీరు చేరడంతో పడవలు ఏర్పాటు చేశారు. ఊడిమూడి లంక వంతెన నిర్మిస్తున్న ప్రాంతాన్ని వరదనీరు చుట్టుముట్టడంతో పనులకు బ్రేక్ పడింది. పుచ్చల్లంక నుంచి నాగుల్లంక పల్లిపాలేనికి వెళ్లే రహదారి నీట మునిగింది. లంకల్లోని పశువులను ఏటిగట్లపైకి తరలించారు. వీటికి పశుగ్రాసానికి కొరత ఏర్పడింది. మానేపల్లిలో ముంపునకు గురైన శివాయలంక రహదారిని కొత్తపేట ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. తహసీల్దార్ షేక్ హుస్సేన్, ఎంపీడీఓ త్రిశూలపాణి, ఆర్ఐ నరసింహారావు తదితరులు వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.



బూరుగులంకలో పడవపై వస్తున్న ప్రజలు



అంబాజీపేట కౌశికలో ఒరిగిపోయిన విద్యుత్ స్తంభం



పాశర్లపూడిలంక ఏటిగట్టుపై వైద్య శిబిరం నిర్వహణ



టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద వరద ముంపు ప్రాంతాల్లో పంపిణీకి సిద్ధం చేసిన వాటర్ టిన్‌లు

## సొసైటీల్లో మౌలిక వసతులు కల్పించాలి

**సఖినేటిపల్లి:** రాష్ట్ర వ్యాప్తంగా గతంలో ఉండే విధంగా సొసైటీల అభివృద్ధికి సంబంధించిన సంస్థను పునరుద్ధరించాలని రాజోలు తాలూకా సమష్టి వ్యవసాయ సహకార సంఘాల సమాఖ్య గౌరవ అధ్యక్షుడు ఓగూరి టాండన్ రాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం మోరి మహిమ కోకోనట్ ప్రొడ్యూసర్స్ కంపెనీ కార్యాలయంలో రాజోలు తాలూకా సమష్టి వ్యవసాయ సహకార సంఘాల సమాఖ్య సమావేశం అధ్యక్షుడు గెద్దం ప్రభాకరరావు అధ్యక్షతన జరిగింది. టాండన్ రాజు మాట్లాడుతూ గతంలో సదరు సంస్థకు ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించేదని, దాని ద్వారా సొసైటీల్లో మౌలిక వసతుల కల్పనకు వీలుకలిగేదని అన్నారు. కాగా సొసైటీలకు సాగునీటి వసతి కల్పించి రైతులకు మేలు చేకూర్చాలని, సొసైటీ భూముల్లో రైతులు వాణిజ్య పంటలను సాగు చేసుకోవడానికి ఇంజిన్లు సమకూర్చాలని, సొసైటీ భూముల్లో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని వంటి వాటిపై ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానాలు చేశారు. ఎఫ్ఎల్‌సీ, సీసీఎఫ్ సొసైటీల అధ్యక్షులు మేడిద ఏషయ్య, దొండపాటి రాజబాబు, తాడి వెంకటేశ్వరరావు, నల్లి సత్యం, గొల్ల శుభాకర్, నల్లి వెంకటేశ్వరరావు, దొండపాటి నరసింహారావు, కొల్లాబత్తుల రామకృష్ణ, నల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.



మోరిలో రాజోలు తాలూకా సమష్టి వ్యవసాయ సహకార సంఘాల సభ్యులు

## నోటీసులు ఇవ్వడం సరికాదు


**సఖినేటిపల్లి:** అంతర్వేది దేవస్థానం, దేవస్థానానికి అనుబంధంగా ఉన్న నీలకంఠేశ్వరస్వామి దేవస్థానం అధికారులు జారీ చేస్తున్న శిస్తుల నోటీసులతో కౌలు రైతుల్లో ఆందోళన నెలకొందని రైతు సంఘ రాష్ట్ర నాయకుడు చెల్లుబోయిన కేశవశెట్టి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం గొందిలో కౌలురైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లి బుజ్జిబాబు అధ్యక్షతన కౌలురైతుల సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిస్తులను నిర్ణయించే ఫెయిర్ రెంట్ కమిటీ, కౌలు రైతులతో చర్చించకుండా ఏకపక్షంగా నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. దేవస్థానం భూముల్లో పలు కారణాల రీత్యా పంటలు పండించలేని స్థితిలో ఉన్నప్పటికీ దేవస్థానానికి కౌలు రైతులు శిస్తులు చెల్లిస్తున్నారన్నారు. సమావేశంలో దొండపాటి చిట్టిరాజు, గేదెల తిరుపతి, దొండపాటి చంద్రమోహన్, నల్లి జాన్‌మోసే, కడలి సువర్ణరాజు, చొప్పల బెన్ని పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

## పుట్టమట్టితో శివలింగాల తయారీ

**రాజోలు:** పుట్టమట్టితో పది వేల శివలింగాలను వాసవీ వనితా క్లబ్, విశ్వహిందూ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో తయారు చేశారు. వీటిని స్థానికంగా గురువారం ప్రదర్శించారు. కోటి పార్థీవ శివలింగాలు తయారు చేయాలని సంకల్పించిన అమెరికా వాసి కోడెల శివప్రసాద్ మిత్ర బృందం అన్ని గ్రామాలకు పుట్టమట్టితోపాటు, శివలింగం తయారు చేసే మౌల్డ్స్‌ను పంపించారని ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ తెలిపారు. ఇందులో భాగంగా 10 రోజుల నుంచి మహిళలు 10 వేల శివలింగాలు తయారు చేశారన్నారు. సంఘ ఉపాధ్యక్షుడు రాజా నాగరత్నకుమార్, కాసు భవాని, చలువాది లక్ష్మి, కాసు సతీష్, దిలీప్, నాగరత్నం, సుధ, సత్యవతి, శిరం నాగమణి పాల్గొన్నారు.



శివలింగాలను ప్రదర్శిస్తున్న వాసవీ వనితా క్లబ్ సభ్యులు

## రక్షణ కవచం హెల్మెట్

**రాజోలు:** వాహనదారులకు హెల్మెట్ రక్షణ కవచం లాంటిదని సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి, జూనియర్ సివిల్ జడ్జి హిమబిందు అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం రాజోలు కోర్టు కాంప్లెక్స్ నుంచి హెల్మెట్ ధరించాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనేక మంది మోటార్ సైకిల్ నడుపుతూ ప్రమాదానికి గురై తలకు చిన్నపాటి దెబ్బ తగిలి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. అటువంటి సమయాల్లో హెల్మెట్ ప్రాణ రక్షణగా ఉపయోగపడుతుందన్నారు. రాజోలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడిశెట్టి సాయిబాబు, ప్రధాన కార్యదర్శి గొల్లమందల స్టాలిన్, సీనియర్ న్యాయవాదులు ఆకుల భాస్కరరావు, కోట సుధాకర్, కొక్కిరగెడ్డ శేషగిరిరావు, యేపుగంటి ఏడుకొండలు, జోహెచ్‌సన్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.



రాజోలు కోర్టు కాంప్లెక్స్ వద్ద ర్యాలీలో పాల్గొన్న న్యాయమూర్తులు

## ఇసుక సరఫరాలో అక్రమాలకు తావివ్వొద్దు

**కొత్తపేట:** ఇసుక సరఫరాలో ఏవిధమైన అక్రమాలకు తావులేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి అధికారులకు సూచించారు. గురువారం స్థానిక ఇసుక స్టాక్ పాయింట్‌ను ఆమె తనిఖీ చేశారు. నియోజకవర్గంలో ఇసుక స్టాక్ పాయింట్లను స్వాధీనం చేసుకున్నప్పుడు నిల్వలు, అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఇసుక సరఫరా, ప్రస్తుతం ఉన్న నిల్వలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు తనిఖీ చేశారు. స్టాక్ పాయింట్‌లో సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముందుగా డివిజన్ రెవెన్యూ కార్యాలయంలో అధికారులతో రెవెన్యూ రికార్డుల భద్రత తదితర అంశాలపై సమీక్షించారు. కార్యక్రమాల్లో ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ, తహసీల్దార్ ఎలీషా, ఎంఆర్ఐ కొప్పిశెట్టి ఏడుకొండలు పాల్గొన్నారు.



కొత్తపేటలో ఇసుక స్టాక్ పాయింట్ వద్ద అధికారులతో సమీక్షిస్తున్న జేసీ నిశాంతి

## విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

**రావులపాలెం:** విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని అమలాపురం ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ గురువారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా ఉండదన్నారు. రావులపాడు, ఊబలంక, కొమరాజులంక గ్రామాలతో పాటు రావులపాలెంలోని డిగ్రీ కాలేజీ ఏరియా, అంకాలమ్మ గుడి ఏరియా, సీఆర్‌సీ రోడ్డు, ఆదిలక్ష్మీనగర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. ఈతకోట సబ్‌స్టేషన్ పరిధిలో గోపాలపురం, ఈతకోట, ముమ్మిడివరప్పాడు, లక్ష్మీపోలవరం, పొడగట్లపల్లి, దేవరపల్లి, మట్టలదొడ్డి, కేతరాజుపల్లి, చెల్లిరేవు, వెదిరేశ్వరం, కోసూరినగర్, గరువు ప్రాంతాలకు అంతరాయం కలుగుతుందన్నారు.

## బాధితుడికి ఆర్థిక సాయం

**రావులపాలెం:** అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి స్థానిక కాశీఅన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు గురువారం చేయూత అందించారు. ఆత్రేయపురం మండలం ర్యాలికి చెందిన చొల్లంగి రాజు రెండు కిడ్నీలూ మార్పిడి చేయాలని వైద్యులు చెప్పారు. ప్రస్తుతం డయాలసిస్ చేయించుకుంటున్నాడు. తండ్రి రాజు ఆటోడ్రైవర్ కావడంతో అంత స్థోమత లేని వారు వైద్యానికి సహాయం చేయాలని కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను కోరారు. దీంతో బాధితుడికి రూ. 18 వేలను అందజేశారు.

**కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి..**

**పి.గన్నవరం:** పి.గన్నవరంలోని ఎమ్మార్సీ కార్యాలయానికి ఎంఈఓ కోన హెలీనా సమక్షంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, పోతవరం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కత్తుల ఆనందరావు గురువారం రూ.12 వేల విలువైన బీరువాను బహూకరించారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఎల్.గన్నవరానికి చెందిన కొల్లు రవీంద్రకు ఎస్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో రూ.12,500 సాయాన్ని అందజేశారు. సంఘ నాయకులు కత్తుల ఆనందరావు, నల్లా బాలాజీ, బల్ల శ్రీనివాస్, నీతిపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



బాధితుడికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

## వృద్ధాశ్రమానికి పరుపులు, దిండ్లు

**మలికిపురం:** విశ్వేశ్వరాయపురంలోని వృద్ధాశ్రమానికి గురువారం స్థానిక బేతేలు ప్రార్థనా మందిరం పాస్టర్ తాడి సూర్యంబాబు, ఝాన్సీ సహకారంతో వారి కుటుంబ సభ్యులు రూ.60 వేల విలువైన పరుపులు, దిండ్లు పంపిణీ చేశారు. ఈ మేరకు ఆశ్రమంలో వారి కుమారులు ప్రిన్స్ ప్రవీణ్, జీవన్ ఆధ్వర్యంలో వృద్ధులకు భోజన వసతి కల్పించారు. పాస్టర్ సమర్పణరావు, కారుపల్లి ఏసురత్నం, ఓగూరి శ్యాంబాబు, భాస్కర్, మధు, ఉదయ్‌కిరణ్, పీటర్ పాల్గొన్నారు.



ఆశ్రమానికి పరుపులు, దిండ్లు అందిస్తున్న దాత కుమారులు ప్రవీణ్, జీవన్

## పెద్దిరెడ్డి కుటుంబంపై ఆరోపణలు దారుణం

**రాజోలు:** పెద్దిరెడ్డి కుటుంబంపై టీడీపీ తప్పుడు ఆరోపణలు చేయడం దారుణమని రాష్ట్ర వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి తెన్నేటి కిశోర్ మండిపడ్డారు. గురువారం ఆయన రాజోలులో మాట్లాడుతూ 10 పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మూడు పర్యాయాలు ఎంపీగా విజయం సాధించిన పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి నాయకత్వంపై ఆ ప్రాంత ప్రజలకు పూర్తి నమ్మకం ఉందన్నారు. మదనపల్లి ఆర్డీఓ కార్యాలయంలో ఫైల్స్ దహనంపై టీడీపీ తప్పుడు ఆరోపణలు చేస్తుందన్నారు. వెయ్యి ఎకరాలు ఆక్రమించారని తమ అనుకూల పత్రికల్లో తప్పుడు కథనాలు రాయించి పెద్దిరెడ్డి కుటుంబంపై కావాలనే బురద జల్లుతుందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు.



తెన్నేటి కిశోర్

## ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు క్షమాపణ చెప్పాలి



చేట్ల రామారావు

**అయినవిల్లి:** అసెంబ్లీ సమావేశాల్లో బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు భారత రాజ్యాంగాన్ని అవమానిస్తూ చేసిన వ్యాఖ్యలకు తక్షణం క్షమాపణ చెప్పాలని, లేదంటే భవిష్యత్తులో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని వైఎస్సార్ సీపీ నాయకుడు, అంబాజీపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చేట్ల రామారావు అన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి 40 శాతం ప్రజలు ఓట్లు వేశారన్నారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అరాచక పాలన సాగుతుందన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలపై దాడులు చేయిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వ అరాచకాలు ఆపాలని డిమాండ్ చేశారు.

## సాయిబాబా సన్నిధిలో అన్నసమారాధన

**ఆలమూరు:** గురు పౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని స్థానిక శ్రీషిర్డీసాయి ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం అన్నసమారాధన నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 10 వేల మంది తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ ప్రతినిధులు చల్లా ప్రభాకరరావు, వంటిపల్లి పాపారావు పర్యవేక్షించారు.

## హాస్టల్ విద్యార్థులకు చేయూత



చాపలను పంపిణీ చేస్తున్న దాత మణిబాబు

**ఆలమూరు:** స్థానిక సమీకృత సంక్షేమ బాలుర వసతి గృహంలోని విద్యార్థులు నిద్రించేందుకు చాపల పంపిణీ గురువారం జరిగింది. కలవచర్ల గ్రామానికి చెందిన వడ్డి మణిబాబు సహకారంతో చాపలు, పండ్లు, పెన్నులను విద్యార్థులకు అందజేశారు. భవిష్యత్తులో విద్యార్థులకు ఏఅవసరం వచ్చినా చెప్పాలని వార్డెన్ సూర్యనారాయణ మూర్తికి తెలిపారు. బాలుర వసతి గృహంలో అసంపూర్తిగా ఉన్న పనులను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

## అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు

**రావులపాలెం:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. బోటని అధ్యాపక పోస్టుకు సంబంధించి పీజీ కోర్సులో 55 శాతం మార్కులకు తక్కువ కాకుండా, నెట్, సెట్ పాసైన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 27న సాయంత్రం 5 గంటల్లోపు కళాశాల కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. 29న ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.